సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం। 4। నవంబర్। 2024



అదరహో..!
1,117 మంది విద్యార్థులతో బాదేపల్లి జెడ్పీహెచ్ఎస్ రికార్డు సృష్టిస్తోంది.

వివరాలు 8లో ▸



స్పోర్ట్స్ యూనివర్సిటీ
పాలమూరుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ రానుందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.2 /20.3

వాతావరణం
ఉదయం నుంచి ఎండ ప్రభావం ఉంటుంది. అడపాదడపా ఆకాశం మేఘావృతమవుతుంది. చిరుజల్లులు కురవవచ్చు.

న్యూస్‌రీల్

సొంత ఖర్చులతోనే విదేశీ పర్యటన



నవాబుపేట: కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఆదివారం సాయంత్రం లండన్ పర్యటనకు వెళ్తున్నట్లు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పర్యటన సందర్భంగా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాగా విదేశీ పర్యటనలు ప్రజాధనంతో చేస్తున్నారని కొందరు రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. తాము ప్రజాధనం వృథా చేసే పాలకులం కాదని.. తమ సొంత ఖర్చులతో పర్యటనకు వెళ్తున్నామని వివరించారు. మా ప్రాంత అభివృద్ధే ముఖ్యమన్నారు. గతంలో మాదిరిగా ప్రజాధనం వృథా చేసే ప్రభుత్వం కాదని, ఇది ప్రజా ప్రభుత్వం అని.. ప్రజల మంచి కోసం మాత్రమే పనిచేస్తుందని చమత్కరించారు.

కార్మిక వర్గాల సమస్యలపై కార్యాచరణ



మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లాలోని జడ్చర్లలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి రాములు, గౌరవాధ్యక్షుడు రాంరెడ్డి, సీనియర్ నాయకులు కిల్లె గోపాల్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేపట్టామన్నారు. జిల్లాలో ప్రధాన సమస్య వలస కార్మికులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మొదటి రోజు జరిగే బహిరంగ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.సాగర్, జాన్‌వెస్లీ, జయలక్ష్మి, ఆర్.వెంకట్రాములు పాల్గొంటారని, రెండోరోజు ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. 8న జరిగే బహిరంగ సభకు వేలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్, నాయకులు రాజ్‌కుమార్, ఈశ్వర్, అంజనేయులు, రమేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజాస్వామిక ఉద్యమాలకు స్ఫూర్తిదాయకం



మహబూబ్‌నగర్ న్యూటౌన్/ పాలమూరు: అంగవైకల్యంతో ఉన్న సాయిబాబాను శారీరకంగా, మానసికంగా ప్రభుత్వాలు చిత్రహింసలకు గురిచేసినా చావును నిరాకరించిన విప్లవ యోధుడిగా సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం జిల్లాకేంద్రంలో ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన సాయిబాబ సంస్మరణ సభలో జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ రవిచంద్ర, విరసం నాయకులు పాణి, ప్రొఫెసర్ సాయిబాబ కూతురు మంజీరా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రపంచ ప్రజాస్వామిక ఉద్యమాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని, నిర్బంధంలో ఉన్నా సహాయకులుగా ఉన్న తోటి ఖైదీలకు విద్యాభ్యాసం చేశారన్నారు. జైలు నుంచి విడుదలయ్యాక ఆదివాసీల కోసం పనిచేస్తానని చెప్పడం సాహసానికి నిదర్శనమన్నారు. కనీస ప్రజాస్వామిక విలువల కోసం, దోపిడి, పీడన లేని మానవీయ సమాజ నిర్మాణం కోసం ప్రజాస్వామిక వాదులు, మేధావులు, వామపక్ష పార్టీలు క్షేత్రస్థాయిలో ఐక్యంగా పోరాటాలు చేయాలన్నారు. సమాజంలోని అనేక అసమానతలను రూపుమాపేందుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని, అప్పుడే ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాలు నెరవేరుతాయన్నారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి, కేసీ వెంకటేశ్వర్లు, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, చైతన్య మహిళా సంఘం నాయకురాలు శ్రీదేవి, హనీఫ్ అహ్మద్, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, నాయకులు కిల్లె గోపాల్, శ్రీశైలం, చంద్రశేఖర్, ప్రముఖ విద్యావేత్తలు లక్ష్మణ్‌గౌడ్, జగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీతో మహర్దశ

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 119 పాఠశాలల ఎంపిక



మహబూబ్‌నగర్‌లోని షాసాబ్‌గుట్ట పాఠశాలలో పీఎంశ్రీ పథకం నిధులతో నిర్మిస్తున్న ల్యాబ్, అదనపు తరగతి గదులు

- మహబూబ్‌నగర్‌లోని కేంద్రీయ విద్యాలయం, వట్టెం నవోదయకూ చోటు
- ఒక్కో స్కూల్ అభివృద్ధికి రూ.2 కోట్ల వరకు మంజూరు
- మొదటి దశలో తరగతి గదులు, ల్యాబ్‌ల నిర్మాణానికి ప్రాధాన్యం
- ఐదేళ్లపాటు నిధుల కేటాయింపుతో మారనున్న రూపురేఖలు



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన వట్టెంలోని జవహర్ నవోదయ విద్యాలయం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పూర్తిస్థాయిలో వసతులు కల్పించేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతుంది. ఈ మేరకు నూతన విద్యావిధానం- 2020లో భాగంగా పాఠశాలల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్ రైజింగ్ ఫర్ ఇండియా) పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం కోసం సంబంధిత పాఠశాల హెచ్ఎం ఆన్‌లైన్ విధానంలో ఫొటోలు ఇతర ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో అధిక సంఖ్యలో విద్యార్థులు, కొద్దిపాటి వసతులు ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి మెరుగుపరిచేందుకు కృషిచేస్తారు. ఈ మేరకు పథకానికి రెండు దశల్లో కలిపి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 119 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో కేజీబీవీలు, గురుకులాలతోపాటు ఎక్కువ సంఖ్యలో హైస్కూళ్లు ఉండగా.. ప్రాథమిక పాఠశాలలకు సైతం చోటు లభించింది. అలాగే కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన మహబూబ్‌నగర్‌లోని కేంద్రీయ, నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెంలోని జవహర్ నవోదయ విద్యాలయాలు సైతం చోటు దక్కించుకున్నాయి. వీటిలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని.. ప్రతి అవసరాన్ని సొంతంగా తీర్చుకునేలా గ్రీన్ పాఠశాలలుగా మార్చేందుకు ప్రయత్నం జరుగుతుంది.

ప్రతి పాఠశాలకు రూ.2 కోట్లు..

ఒక్కో పాఠశాలకు ఐదేళ్ల వ్యవధిలో రూ.2 కోట్ల వరకు నిధులు విడతల వారీగా మంజూరు చేయనున్నారు. ఇందులో రూ.కోటి వరకు నిర్మాణాల కోసం, మరో రూ.కోటిని వివిధ పరికరాల కొనుగోలు, ల్యాబ్‌ల ఏర్పాటుకు వెచ్చిస్తారు. పాఠశాలకు ఇచ్చే నిధుల్లో 60 శాతం కేంద్ర ప్రభుత్వం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించనున్నాయి. ఈ స్కీం ద్వారా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, వారికి అవసరమయ్యే సైన్స్ ల్యాబ్‌లు నిర్మించనున్నారు. ఇందులో భాగంగా మొదటి దశలో ఎన్నికైన సుమారు 75 పాఠశాలల్లో రెండు తరగతి గదులు, ఒక సైన్స్ ల్యాబ్‌ను సుమారు రూ.45 లక్షలతో నిర్మిస్తున్నారు. అలాగే ఈ సంవత్సరం ఎంపికైన 44 పాఠశాలల్లో వివిధ పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తుంది. వీటిలో కూడా పనులు త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

సర్వతోముఖాభివృద్ధి..



ప్రభుత్వం తీసుకువచ్చిన పీఎంశ్రీ పథకంతో పాఠశాలలు సర్వతోముఖాభివృద్ధి చెందనున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు గ్రీన్ స్కూల్ ఏర్పాటు వల్ల ఎలాంటి కాలుష్యం లేకుండా చేయవచ్చు. ప్రతి పాఠశాలకు రూ.2 కోట్లు ప్రభుత్వం ఇవ్వనుంది. వీటితో తరగతి గదులు, ల్యాబ్‌లు, సోలార్ ప్యానెల్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వంటివి సమకూరుతాయి. సైన్స్ ల్యాబ్, అదనపు తరగతి గదుల కోసం ప్రత్యేకంగా నిధులు వస్తాయి.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

ఉమ్మడి జిల్లాలో పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలలు, అందుకునే నిధులు ఇలా..

జిల్లా	పాఠశాలలు	నిధులు (రూ.కోట్లలో..)
నాగర్‌కర్నూల్	29	58
మహబూబ్‌నగర్	28	56
నారాయణపేట	19	38
జోగులాంబ గద్వాల	22	44
వనపర్తి	21	42

గ్రీన్ పాఠశాలలుగా మార్పు..

పీఎంశ్రీకి ఎంపికైన వాటిని గ్రీన్ పాఠశాలలుగా మార్చేందుకు కృషిచేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా ప్రధానంగా పాఠశాలలకు అవసరమయ్యే విద్యుత్ పూర్తిగా అక్కడే ఉత్పత్తి చేసుకునేలా రూఫ్‌పై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయనున్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి (రెయిన్ హార్వెస్టింగ్) పాఠశాల అవసరాలకు నీటిని వినియోగించుకునేలా తీర్చిదిద్దుతారు. పూర్తిస్థాయిలో ల్యాబ్స్ అందుబాటులోకి తీసుకురానున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన కూరగాయలు, ఇతర ఔషధ మొక్కలను పెంచేందుకు (న్యూట్రిగార్డెన్స్) ఏర్పాటు చేస్తారు. పాఠశాలలో వెలువడుతున్న చెత్త నిర్వహణ, వీటన్నింటినీ పరిరక్షించేందుకు పాఠశాలకు ప్రహరీ నిర్మించనున్నారు.

హంసవాహనంపై ఊరేగిన కురుమూర్తిరాయుడు



అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆవాహిత దేవతాపూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించగా.. రాత్రి పద్మావతి సమేతుడైన కురుమూర్తి స్వామిని హంసవాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తుల స్వామివారి నామస్మరణతో కురుమూర్తిగిరులు మార్మోగాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మధనేశ్వర్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– చిన్నచింతకుంట

వైభవంగా హనుమాన్ చాలీసా పారాయణం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

- దాదాపు 2 వేల మందితో సామూహిక గళార్చన



ఏపీ జితేందర్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్‌ను సన్మానించిన అకాడమీ ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్వరలహరి కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం అలరించింది. జిల్లాకేంద్రం పాల్కొండ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం దాదాపు 2000 మందితో హనుమాన్ చాలీసా సహస్ర గళార్చన నిర్వహించారు. ముందుగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రచయిత పల్లెర్ల రాంమోహన్‌రావు రచించిన హనుమాన్‌చాలీసా విశేషాలు పుస్తకాన్ని ఆవిష్కరించి.. అందరికీ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర క్రీడల వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొనగా అకాడమీ ప్రతినిధులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు వి.మనోహర్‌రెడ్డి, బుర్రి వెంకట్రాంరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, స్వరలహరి కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు నాయిని భాగన్నగౌడ్, కార్యదర్శి డీకే ఆంజనేయులు, కోశాధికారి మేకల శ్రీనివాసులు, గంగాపురం పవన్‌కుమార్‌శర్మ, నవీన్‌కుమార్, భద్రయ్య, శ్రీశైలం, భాస్కర్, రామచంద్రయ్య, శేఖర్, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్ఈ రమేష్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): విద్యుత్ వినియోగదారులకు మరింత చేరువ అయ్యేందుకే విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని విద్యుత్ భవన్‌లో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల దినోత్సవంలో ఆయన బాధితుల నుంచి ఫిర్యాదులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, రాజాపూర్‌లో వినియోగదారుల దినోత్సవం నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో మహబూబ్‌నగర్‌లో 8, జడ్చర్లలో 23, రాజాపూర్‌లో 3, దేవరకద్రలో 3 ఫిర్యాదులు వచ్చాయని, వీటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై విద్యుత్ సిబ్బంది స్పందించకుంటే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఈ నవీన్, ఎస్ఏఓ వెంకటేశ్వర్లు, డీఈ వెంకటశివరాం, రెవెన్యూ ఏఓ బీచుపల్లి పాల్గొన్నారు.

పాలమూరును పర్యాటకంగా తీర్చిదిద్దుతాం




భోగమహేశ్వరంలో కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

అచ్చంపేట రూరల్: ధనిక రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చింది ఎవరో అందరికీ తెలుసని.. పది మాసాల ప్రభుత్వంపై పదేళ్లు పాలన చేసిన బీఆర్ఎస్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అచ్చంపేట మండలం ఉమామహేశ్వర క్షేత్రంలోని భోగమహేశ్వరంలో ఆదివారం ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి మంత్రి విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను తాము ఎత్తివేయలేదని.. ఆ ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రతినెలా రూ.6 వేల కోట్ల వడ్డీ చెల్లిస్తున్నామని, దీనికోసమే మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వం ఓఆర్ఆర్‌ను 35 ఏళ్లకు తాకట్టు పెట్టడంతో పాటు ఖజానా మొత్తం ఖాళీ చేసిందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక దుస్థితి ఏర్పడేలా పాలన సాగించారని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. రైతుభరోసా ఆలస్యం కావడానికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం అనర్హులు, కోటీశ్వరులు, గుట్టలకు, రోడ్లకు రైతుబంధు ఇచ్చారని ఆరోపించారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతూ.. రానున్న స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. ప్రజలు పూర్తిగా విశ్లేషణ చేసుకోవాలని కోరారు.

➩ దేశంలోనే అత్యంత సుందరమైన ప్రదేశాలు ఉన్న ఉమ్మడి పాలమూరును పర్యాటకంగా తీర్చిదిద్దుతామని మంత్రి అన్నారు. నల్లమలలో ప్రకృతి సంపదకు కొదవ లేదని.. నల్లమలను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. పర్యాటకంగా అభివృద్ధి చెందితే యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇప్పటికే కొల్లాపూర్ సోమశిల వద్ద లాంచీలు ప్రారంభమయ్యావన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

- నియోజకవర్గానికి 3,500 చొప్పున కేటాయింపు
- కేబినెట్ నిర్ణయంతో ఆనందంలో లబ్ధిదారులు
- సొంతింటి కల నెరవేరనుందని ఆశాభావం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నిరుపేదలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సొంతింటి కల నెరవేరనుంది. రాష్ట్ర మంత్రివర్గం ఇందిరమ్మ ఇళ్లకు ఆమోదం తెలపడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఈ నెల 15 నుంచి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, త్వరలో విధివిధానాలు సైతం ఖరారు రూపొందిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొనడంతో పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రజాపాలనలో ఈ పథకం కింద జిల్లావ్యాప్తంగా లక్షలాది మంది దరఖాస్తు చేసుకున్నారు.

విధివిధానాలు ప్రకటిస్తేనే..

ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో దరఖాస్తుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన పదేళ్లుగా డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పినా ఎక్కడా అమలు కాలేదు. దీంతో లక్షలాది మంది పేదలు సొంత ఇంటి కోసం ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. తీరా గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కాకుండా.. ఇళ్లు నిర్మించుకుంటే రూ.3 లక్షల ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించింది. ఈ పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ పూర్తిగా అమలుకు నోచుకోలేదు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తాము రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించింది.

నియోజకవర్గానికి 3500...

ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ప్రకటించింది. దీంతో జిల్లాలో మూడు నియోజకవర్గాలు ఉండగా మొత్తం 10,500 ఇళ్లు మంజూరు కానున్నాయి. అయితే పరిగి నియోజకవర్గంలోని గండేడ్ మండలం, నారాయణపేట నియోజకవర్గంలోని కోయిల్‌కొండ మండలం జిల్లా పరిధిలో ఉండగా.. వీటికి ఎలా నిర్ణయిస్తారో వేచి చూడాల్సి ఉంది.

విధివిధానాలు రావాలి..



ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రక్రియ ప్రారంభమైంది. అయితే ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి విధివిధానాలు రావాలి. ప్రతి నియోజవకర్గానికి 3500 చొప్పున మంజూరు చేయడంతో జిల్లాకు 10,500 ఇళ్లు రానున్నాయి. ఇళ్ల పథకం అమలుకు హౌజింగ్ శాఖ నోడల్‌గా వ్యవహరించనుంది. త్వరలోనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది.

– భాస్కర్, హౌజింగ్ పీడీ



ఇందిరమ్మ ఇంటి నమూనా

దరఖాస్తుదారుల నుంచి..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధానమైంది. ఈ పథకం కింద లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి అవసరమైన రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందించనున్నట్లు ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించింది. స్థలం లేని వారికి స్థలంతో పాటు ఇంటిని నిర్మించి ఇస్తామని పేర్కొంది. ఈ క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టడానికి కసరత్తు చేస్తోంది. అయితే జిల్లాలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల నుంచి ఎంపిక ఉండనుంది. ప్రధానంగా ఇంటి నిర్మాణానికి స్థలం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఒక్కో నియోజకవర్గంలో 3,500 మంది లబ్ధిదారులను గుర్తించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకంలో చేరితే రాష్ట్ర ప్రభుత్వంపై కొంత ఆర్థిక భారం తగ్గుతుందన్న ఆలోచనతో ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తారా.. లేదంటే కొత్తగా మార్గదర్శకాలు ఉంటాయా అన్నది తేలాల్సి ఉంది.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నూతన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. అంతేకాకుండా సర్వీస్, లీవ్ రూల్స్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్, కిష్టయ్య, ఉమాదేవి, భాస్కర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటిగుంతలో పడి బాలుడు మృతి

వంగూరు: ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి ఓ బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని ఎంఏఆర్‌కాలనీలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రమేశ్, సంధ్య దంపతుల కుమారుడు సత్యదేవ్ (2) ఇంటి ముందు ఆడుకుంటూ నీటిగుంతలో పడిపోయాడు. కాసేపటి తర్వాత బాలుడు గుంతలో పడిన విషయాన్ని గుర్తించి బంధువుల సాయంతో బయటకు తీసి వెంటనే 108 వాహనంలో కల్వకుర్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

కందూరులో మరో బాలుడు..


సాయి రిషి (ఫైల్)

అడ్డాకుల: ఆడుకుంటూ వెళ్లిన ఓ బాలుడు నీటి కుంటలో పడి మృతిచెందిన ఘటన అడ్డాకుల మండలం కందూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన భూదేవి, దశరథం దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా.. చిన్న కుమారుడు సాయి రిషి (7) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రెండోతరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవురోజు కావడంతో ఇంటి పరిసరాల్లో ఉండే ముగ్గురు పిల్లలు కలిసి రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో ఉన్న జంగాలమ్మ కుంట వద్దకు వెళ్లారు. అక్కడ చేపలు పడుదామంటూ నీటి సమీపంలోకి వెళ్లి ప్రమాదవశాత్తు సాయి రిషి కుంటలో పడి మునిగిపోయాడు. మిగిలిన ఇద్దరు పిల్లలు వెంటనే గ్రామంలోకి వెళ్లి గ్రామస్తులను తీసుకొచ్చారు. వారు లోనికి దిగి బాలుడిని బయటకు తీయగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

కారు, ఆటో ఢీ : భర్త దుర్మరణం

- భార్యకు గాయాలు

జడ్చర్ల: కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో భర్త మృతిచెందగా.. భార్యకు గాయాలైన ఘటన మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దివిటిపల్లి సమీపంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకాలనీలో నివాసం ఉంటున్న శాంతయ్య (48) హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో జరిగే పుట్టినరోజు వేడుకలకు వెళ్తున్న భార్య రాధికను జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో దిగబెట్టేందుకు సొంత ఆటోలో ఇంటి నుంచి బయలుదేరారు. ఆటో జాతీయ రహదారిపైకి చేరుతున్న సమయంలో కర్నూలు వైపు నుంచి వచ్చిన కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన భార్యాభర్తలను వెంటనే జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే శాంతయ్య మృతిచెందినట్లు ధ్రువీకరించారు. రాధికకు గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్. కారు ఢీకొని మరొకరు..


చిన్నపాగ వాలీ (ఫైల్)

కొత్తకోట రూరల్: ట్రాక్టర్, కారు ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి నాటవెల్లి సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఏఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు.. ఆత్మకూర్ మండలం వీరరాఘవపురం గ్రామానికి చెందిన చిన్నపాగ వాలి (35), కమ్మరి నరేశ్ ఇంటి నిర్మాణానికి వినియోగించే పిల్లర్ బాక్స్‌లు తీసుకొచ్చేందుకు ట్రాక్టర్‌లో ఆదివారం సాయంత్రం కొత్తకోటకు వచ్చారు. బాక్సులు వేసుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా నాటవెల్లి సమీపంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిన్నపాగ వాలి అక్కడికక్కడే మృతిచెందగా.. ట్రాక్టర్ డ్రైవర్ కమ్మరి నరేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ట్రాక్టర్ రోడ్డుపై అడ్డంగా పడటంతో ట్రాఫిక్ స్తంభించింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు హైవే సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌ను పక్కకు తీసి రాకపోకలు పునరుద్ధరించారు. చిన్నపాగ వాలీ కొంతకాలంగా కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ కూలీ పనిచేస్తూ జీవనం సాగించేవాడని.. దీపావళి పండుగకు గ్రామానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

టిప్పర్ ఢీకొని మహిళ..

కోయిల్‌కొండ: మండలంలోని రాంపూర్ సమీపంలో ఆదివారం రాత్రి టిప్పర్ ఢీకొని మహిళ మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల రాములు భార్య పిచ్చకుంట్ల మాసనమ్మ (70) ఆదివారం గ్రామ సమీపంలో వ్యవసాయ పొలంలో కూలీకి వెళ్లింది. సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా మహబూబ్‌నగర్ నుంచి కోయిల్‌కొండకు వెళ్తున్న టిప్పర్ ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బాదేపల్లి హైస్కూల్ అదరహో!


పాఠశాల మైదానంలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

బాధ్యత పెరిగింది..

జిల్లాలోనే ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలగా ఆవిర్భవించడంతో ఉపాధ్యాయ బృందంపై బాధ్యత పెరిగినట్లయ్యింది. జిల్లా అధికారులు, ఇతర హైస్కూళ్ల దృష్టి మాపైనే ఎక్కువగా ఉంటుంది. అందుకే మా వంతుగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నాం. అలాగే వచ్చే ఏడాది శతాబ్ది ఉత్సవాలు జరుపుకోనున్న తరుణంలో ఇలాంటి అరుదైన రికార్డు మా పాఠశాలకు దక్కడం గర్వంగా ఉంది. – చంద్రకళ, హెచ్‌ఎం, బాదేపల్లి బాలుర హైస్కూల్

- జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో 1,117 మంది విద్యార్థులు
- తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాల్లో బోధన
- వచ్చే ఏడాది శతాబ్ది ఉత్సవాలకు సిద్ధమవుతున్న పాఠశాల


బాదేపల్లి బాలుర ఉన్నత పాఠశాల

విద్యార్థుల సంఖ్య ఇలా..

మీడియం	బాలురు	బాలికలు	మొత్తం
ఇంగ్లీష్	452	183	635
తెలుగు	275	145	420
ఉర్దూ	39	23	62
మొత్తం	766	351	1,117

జడ్చర్ల టౌన్: ప్రైవేటు స్కూళ్లతో పాటు నవోదయ, కేజీబీవీలు, ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు రావడంతో ప్రభుత్వ పాఠశాలల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లాలోనే అత్యధిక విద్యార్థులు కలిగిన పాఠశాలగా బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల రికార్డు సృష్టిస్తోంది. ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మీడియంలలో 1,117 మంది విద్యార్థులు చదువుతున్నారు. వచ్చే ఏడాది శత వసంతంలోకి అడుగు పెడుతున్న తరుణంలో బాదేపల్లి హైస్కూల్ అరుదైన మైలురాయిని చేరుకోవడం విశేషంగా చెప్పుకోవచ్చు. జిల్లాలో జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గాలు ఉండగా.. మొత్తం 135 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ఉన్న మోడల్ బేసిక్ స్కూల్‌ను తలదన్నేలా ఈ ఏడాది అత్యధిక విద్యార్థులు కలిగిన పాఠశాలగా బాదేపల్లి హైస్కూల్ రికార్డు సృష్టించింది. ఈ పాఠశాల తర్వాత మహబూబ్‌నగర్ మోడల్ బేసిక్ స్కూల్ సుమారు 830 మంది విద్యార్థులతో జిల్లాలో రెండవ స్థానంలో నిలిచింది. బాదేపల్లి పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలలో ప్రవేశాలు కల్పిస్తూ విద్యాబోధన చేస్తున్నారు. దీంతోపాటు అతిపెద్ద మైదానం సైతం ఇక్కడే ఉండటం విశేషం.

1925-26లో ప్రారంభం..

జడ్చర్ల రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న ధర్మశాల వద్ద 1925-26లో ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలగా ప్రారంభమైంది. ఆ తర్వాత కొన్ని రోజులకే తెలుగు మీడియం సైతం ప్రారంభించారు. 1949-50లో మాధ్యమిక పాఠశాలగా మారింది. అప్పుడే సిగ్నల్‌గడ్డకు పాఠశాలను తరలించారు. అనంతరం 1956-57లో ఉన్నత పాఠశాలగా ఆవిర్భవించి.. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా దినదినాభివృద్ధి చెందుతూ వస్తోంది. మొదట ఉర్దూ మీడియంలో ప్రారంభమైనప్పటికీ.. కాలక్రమేణ తెలుగు మీడియంకు ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. 2009లో ఇంగ్లిష్ మీడియం సైతం ప్రారంభించారు. మూడు మీడియంలలో 1,117మంది విద్యార్థులు చదువుతుండగా.. ఇంగ్లిష్ మీడియంలోనే 766 మంది ఉండటం విశేషం. ఇలా 99 ఏళ్లుగా నిర్విరామంగా విద్య అందిస్తూ ఎంతోమంది విద్యావేత్తలను తీర్చిదిద్దింది. ప్రభుత్వ పాఠశాల శతాబ్ది ఉత్సవాలకు సిద్ధమవ్వడం విశేషంగా చెప్పుకోవచ్చు. నియోజకవర్గ చరిత్రలో ఇదో మైలురాయిగా నిలిచిపోనుంది. పాఠశాలలో 50 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా.. మరో 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

భగవంతుడి నామస్మరణతో అవరోధాలు దూరం


సన్మానం పొందిన వేదపండితులతో నిర్వాహకులు

వనపర్తిటౌన్: ఎక్కడ ఉన్నా.. ఏ పని చేసినా.. మనసులో భగవంతుడిని స్మరించుకుంటే ఎన్ని అవరోధాలైనా అలవోకగా దాటవచ్చని వేద పండితులు సృష్టి ఆదిశేషశర్మ, యర్లపాటి ధీరజ్‌శర్మ, కలాకర శ్రీకాంత్‌శర్మ, శశిధరశర్మ అన్నారు. లోక కల్యాణార్థం 84 రోజుల పాటు 24 వేల కిలోమీటర్లు ప్రయాణించి అష్టాదశ శక్తిపీఠాల్లో చండీహోమాలు, లక్ష్మీపూజలు, ద్వాదశ జ్యోతిర్లింగాల్లో రుద్ర యాగం పూర్తిచేసిన వేద పండితులను ఆదివారం జిల్లాకేంద్రంలో ప్రముఖ సామాజిక కార్యకర్త పోచ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బ్రహ్మణ పరిషత్ మాజీ సభ్యుడు జ్యోషి గోపాలశర్మ, సామాజిక కార్యకర్త పోచ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలమూరులోని జోగుళాంబ సన్నిధిలో ప్రారంభమైన క్రతువు శ్రీశైలంలో ముగించారని, ధర్మపరిరక్షణకు పాటుపడిన వేద పండితులను సన్మానించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం వేద పండితులు మాట్లాడుతూ.. దేశంలోని సకల జీవ రాశులు, మానవాళి క్షేమాన్ని కోరుతూ ఆసేతు హిమాచలంలో రుద్రయాగం, చండీహోమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మారం బాలకృష్ణ, గోకారం రాజు, యాదగిరి పాల్గొన్నారు.

డెంగీతో విద్యార్థి మృతి


సందీప్ (ఫైల్)

జడ్చర్ల: డెంగీ బారినపడి ఓ విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మిడ్జిల్ మండలం బైరంపల్లికి చెందిన శ్రీశైలం కుటుంబం జడ్చర్లలోని పద్మావతి కాలనీలో నివాసం ఉంటోంది. శ్రీశైలం పెద్ద కుమారుడు సందీప్ (16), చిన్న కుమారుడు సంతోష్ రెండ్రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుండటంతో శనివారం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున సందీప్ మృతిచెందాడు. తమ్ముడు సంతోష్ చికిత్స అనంతరం కోలుకున్నారు. సందీప్ స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదివేవాడు. విషయం తెలుసుకున్న వైద్యసిబ్బంది బాధితుడి ఇంటి పరిసరాల్లో సర్వే చేపట్టారు.

రాష్ట్రంలో అసమర్థ పాలన

- పాలమూరు ఎత్తిపోతలపై నిర్లక్ష్యం వీడాలి
- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: రాష్ట్రంలో అసమర్థ పాలన కొనసాగుతోందని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు కావొస్తున్నా ప్రాజెక్టుల నిర్మాణంపై దృష్టి సారించకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి ప్యాకేజీ-3 వద్ద పెండింగ్‌లో ఉన్న 3.5 కి.మీ. కాల్వ పనులు పూర్తిచేస్తే.. ఏదుల, వట్టెం, కర్వెన రిజర్వాయర్లలో నీరు నింపే అవకాశం ఉందన్నారు. పాలమూరు ఎత్తిపోతలపై ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ వచ్చేనెల 7న ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అవసరమైతే గతంలో మాదిరిగా భరోసా యాత్ర పేరుతో రాష్ట్రం మొత్తం తిరుగుతానని అన్నారు. ప్రాజెక్టులపై మంత్రులు, ఎమ్మెల్యేలకు కనీస అవగాహన లేదన్నారు. పాలమూరు ఎత్తిపోతల నిర్మాణం కోసం కొల్లాపూర్ వద్ద బ్లాస్టింగ్‌లతో కేఎల్‌ఐ రిజర్వాయర్ దెబ్బతింటుందని చెప్పినా అప్పట్లో మంత్రి జూపల్లి కృష్ణారావు పట్టించుకోకుండా పనులు కొనసాగించారని ఆరోపించారు. దీంతో కేఎల్‌ఐకి సంబంధించిన రెండు మోటార్లు పాడయ్యాయని అన్నారు. ఎల్లూరు రిజర్వాయర్‌లో 5 మోటార్లు పెడితే కాల్వ కెపాసిటీ పెంచాలని కోరిన తనపై అప్పట్లో 3వేల మందితో దాడి చేశారని గుర్తుచేశారు. ఆరు గ్యారంటీలు, రైతు భరోసా వంటి హామీలను ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో మొఖం చూపించలేకపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ చేసేందుకు ముఖ్యమంత్రికి సమర్థులైన ఎమ్మెల్యేలు దొరకడం లేదా అని ప్రశ్నించారు. మంత్రులు ఉంటే అభివృద్ధికి పాటుపడే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో అర్థం రవి, బాలాగౌడ్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

బాలికపై హత్యాయత్నం

మహబూబ్‌నగర్ క్రైం: దుకాణం దగ్గర ఆడుకుంటున్న ఓ మూడేళ్ల బాలికను పక్కకు తీసుకువెళ్లి గొంతు నులిమే ప్రయత్నంతోపాటు దుస్తులు విప్పడానికి ప్రయత్నించిన ఓ వ్యక్తిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రూరల్ సీఐ గాంధీనాయక్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని బైపాస్ రోడ్ సమీపంలో ఓ దుకాణ నిర్వాహకుడి కూతురు(3) ఆదివారం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఆడుకుంటుండగా అక్కడే ఓ హోటల్‌లో పనిచేసే వ్యక్తి బాలికను పక్కకు తీసుకువెళ్లి గొంతు నులిమే ప్రయత్నం చేయడంతోపాటు దుస్తులు విప్పేందుకు ప్రయత్నిస్తుండగా తల్లిదండ్రులు, స్థానికులు గమనించి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై హత్యాయత్నంతోపాటు పొక్సో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. అయితే ఈ వ్యవహారం ఉదయం జరిగినా బయటకు రాకుండా సదరు హోటల్ నిర్వాహకులు బాధితుడి తండ్రితో బేరసారాలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సాయంత్రం పోలీసులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు.

పశువులను అపహరించే ముఠా అరెస్ట్


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు.. చిత్రంలో సీఐ, ఎస్ఐ, నిందితులు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ..

దేవరకద్ర రూరల్: వ్యవసాయ పొలాలు, గ్రామ సమీపంలో కట్టేసిన పశువులను దొంగిలిస్తున్న ఓ ముఠాను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం దేవరకద్ర పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా నందికొట్కూర్‌కు చెందిన డేగ లింగయ్య వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలకు వెళ్లి క్రయ, విక్రయాలు జరిపేవాడు. అది లాభసాటిగా లేకపోవడంతో పశువులను దొంగిలించి విక్రయించాలని పూనుకున్నాడు. ఇందుకోసం అదే జిల్లాలోని సలేశ్వరం, అజీం, సాంబశివుడితో పాటు కొల్లాపూర్ మండలం నర్సింగాపురం గ్రామానికి చెందిన బొలెరో డ్రైవర్ జమదాగ్నితో కలిసి ముఠాగా ఏర్పడి పశువుల దొంగతనాలను ప్రారంభించారు. గత నెల 26న దేవరకద్ర మండలం బల్సుపల్లి సమీపంలో పొలంలో కట్టేసిన నాలుగు గేదెలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధిత రైతు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఈ నెల 2న ఎస్ఐ నాగన్న తన సిబ్బందితో కలిసి దేవరకద్రలో వాహన తనిఖీలు చేపడుతుండగా.. రెండు ఎద్దులను తరలిస్తున్న బొలెరో వాహనం కనిపించింది. అనుమానం వచ్చి వివరాలు సేకరిస్తుండగా అందులో ఉన్న ఐదుగురు పారిపోయేందుకు యత్నించారు. వెంటనే అదుపులోకి తీసుకొని విచారించగా దేవరకద్రతో పాటు జడ్చర్ల, తిమ్మాజీపేట, భూత్పూర్, తాండూర్, కల్వకుర్తిలో పశువులను దొంగతనం చేసి లింగాలలో ఉంచినట్లు చెప్పారు. అక్కడికి వెళ్లి 7 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ముఠాను పట్టుకున్న సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. విలేకర్ల సమావేశంలో సీఐ రామకృష్ణ, ఎస్ఐ నాగన్న, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మిడ్జిల్: మండలంలోని కంచన్‌పల్లికి చెందిన దేశమోని నర్సింహులు (45) మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. తమ్ముడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మరొకరు..

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముడావత్ శంకర్(40) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. వనపర్తి జిల్లా ఎర్రగుట్టతండాకు చెందిన ముడావత్ శంకర్, నర్సింహులు కలిసి శనివారం స్కూటీపై హైదరాబాద్ నుంచి సొంతూరుకు వస్తుండగా జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న మినీ బస్సును డ్రైవర్ అకస్మాత్తుగా ఆపడంతో వెనక వస్తున్న స్కూటీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న శంకర్ తీవ్రంగా గాయపడగా వెనకాల కూర్చున్న నర్సింహులుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శంకర్ మృతిచెందాడు. ఆదివారం శంకర్ భార్య ముడావత్ హేమ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిగురిస్తున్న ఆశలు

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల కల నెరవేరనుంది. మరో రెండు రోజుల్లో ఆర్డీఎస్ చివరి ఆయకట్టు వరకు సాగునీరు పారనుంది. ఒకప్పుడు కేవలం 20వేల నుంచి 30వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతుండగా.. ఇప్పుడు పూర్తి ఆయకట్టు, నాన్ ఆయకట్టుతో కలిపి అక్షరాల లక్ష ఎకరాలకు సాగునీరు అందనుంది. ఈమేరకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆర్డీఎస్ పూర్తి ఆయకట్టు 87,500 ఎకరాలు కాగా.. ప్రతిసారి డిస్ట్రిబ్యూటరీ -21 నుంచి డి-30 వరకే సాగునీరు పారేది. తుమ్మిళ్ల లిఫ్ట్ ప్రారంభం కావడం.. జూరాల లింకు కాల్వను అనుసంధానం చేయడం ద్వారా నీటి ఉధృతి పెరిగి ఆర్డీఎస్ చివరి డిస్ట్రిబ్యూటరీ -40 వరకు సాగునీరు పారనుంది. మొత్తంగా చివరి ఆయకట్టుకు సైతం నీరు పారనుండడంతో పంటలకు ప్రాణం పోసినట్లయ్యింది.


వడ్డేపల్లి మండలం తనగల సమీపంలోని 23వ డిస్ట్రిబ్యూటరీ వద్ద నిండుగా ప్రవహిస్తున్న ఆర్డీఎస్ కెనాల్

రెండురోజుల్లో ఆర్డీఎస్ చివరి ఆయకట్టుకు సాగునీరు

- వేలాది ఎకరాల్లోని పంటలకు ప్రాణం
- ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ వద్ద 1.2 అడుగుల మేర ఓవర్ ఫ్లో
- రాష్ట్ర సరిహద్దు సింధనూర్ వద్ద 5.6 అడుగుల మేర నీటి ప్రవాహం
- తుమ్మిళ్ల లిఫ్ట్ ప్రారంభం.. జూరాల లింకు కాల్వతో పెరగనున్న నీటి ఉధృతి
- నిండుకుండను తలపిస్తున్న ఆర్డీఎస్ కెనాల్

శాంతినగర్: అలంపూర్ రైతుల ప్రధాన సాగు నీటి వనరైన ఆర్డీఎస్ కెనాల్ నుంచి మరో రెండు రోజుల్లో చివరి ఆయకట్టు డి-40 వరకు సాగు నీరు పారనుంది. కర్ణాటక పరిధిలోని తుంగభద్ర డ్యాం (టీబీ డ్యాం) నుంచి విడుదలవుతున్న నీటితోపాటు తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ రన్నింగ్‌లో వుండటంతో ఆర్డీఎస్ కెనాల్ నిండుగా ప్రవహిస్తూ జలకళను సంతరించుకుంది. గత కొన్ని రోజులుగా వర్షాలు కురవకపోవడంతో మూడు రోజుల క్రితం తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్‌ను ఆర్డీఎస్ అధికారులు ఆన్ చేశారు. దీంతో వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల సమీపంలోని డి-23 వద్ద తుంగభద్ర నీరు పరవళ్లు తొక్కుతూ ఆర్డీఎస్ కెనాల్‌లో అలంపూర్ వైపునకు ప్రవహిస్తోంది. గతంలో డి-20 నుంచి 30 వరకు పరిమితమైన ఆర్డీఎస్ నీటి ప్రవాహం ఆదివారం సాయంత్రం వరకు డి-37 చేరుకుంది. మరో రెండు రోజుల్లో చివరి ఆయకట్టు అయిన డి-40 వరకు పూర్తి స్థాయిలో నీరు పారేలా కృషిచేస్తామని ఆర్డీఎస్ ఈఈ విజయకుమార్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసులు పేర్కొన్నారు.

ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ వద్ద ఓవర్ ఫ్లో

కర్ణాటక పరిధిలోని ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ వద్ద 9.2 అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. ఆనకట్ట ఎత్తు 8 అడుగులు వుండటంతో 1.2 అడుగుల మేర (12,233 క్యూసెక్కులు) కట్టపై ఓవర్ ఫ్లో కొనసాగుతోంది. దీంతో తుంగభద్ర నదిలోకి సుంకేసుల వైపు తుంగభద్రమ్మ పరవళ్లు తొక్కుతూ ముందుకు సాగుతోంది. ఆనకట్ట వద్ద నీరు నిండుగా వుండటంతో ఆర్డీఎస్ కెనాల్ షెట్లర్లు పూర్తిగా తెరిచారు. దీంతో ఆర్డీఎస్ కెనాల్ నిండుగా ప్రవహిస్తోంది. కిలోమీటర్ 3.2 వద్ద 8.3 అడుగులు (652 క్యూసెక్కులు) మేర ప్రవాహం ఉంది. రాష్ట్ర సరిహద్దులోని 42.60 కిలోమీటర్ సింధనూర్ వద్ద 5.6 అడుగుల మేర (442 క్యూసెక్కులు) నీరు పారుతోంది. హెడ్‌వర్క్స్ నుంచి విడుదలవుతున్న నీరు ఉప్పల శివారులోని డి-21 వద్ద 4 అడుగుల మేర వచ్చి చేరుతున్నాయి.

తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా..



కిలోమీటర్ 95 వద్ద ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో నాలుగు అడుగుల మేర ప్రవహిస్తున్న తుమ్మిళ్ల లిఫ్ట్ నీరు

తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ఆన్‌లో వుండటంతో తనగల సమీపంలోని డి-23 వద్ద కెనాల్ పూర్తిస్థాయిలో ప్రవహిస్తూ అలంపూర్ వైపు నీరు పరుగులు తీస్తోంది. ఆదివారం సాయంత్రం డి-37 వరకు నీరు చేరుకుంటుంది. మిగతా మూడు డిస్ట్రిబ్యూటరీలకు మరో రెండు రోజుల్లో సాగునీరందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలాఉండగా, డిస్ట్రిబ్యూటరీ 12 నుంచి 40 వరకు రాష్ట్రంలోని అలంపూర్ నియోజకవర్గంలో 87,500 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యం కాగా.. తుమ్మిళ్ల లిఫ్ట్ ప్రారంభం కాకముందు 20వేల ఎకరాల వరకే నీరు అందేది. అనంతరం తుమ్మిళ్ల లిఫ్ట్ ప్రారంభించగా.. దీని ద్వారా 52,500 ఎకరాలకు, ఆర్డీఎస్ హెడ్‌వర్క్స్ నుంచి 35,000 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు.

జూరాల లింక్ కెనాల్ ద్వారా..

తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా విడుదలవుతున్న నీరు డి-37 వరకు పారుతోంది. మిగతా మూడు డిస్ట్రిబ్యూటరీలకు జూరాల లింక్ కెనాల్ ద్వారా ఆర్డీఎస్ కెనాల్‌కు అనుసంధానం చేసి ఆర్డీఎస్ ప్రధాన కాల్వ ద్వారా చివరి ఆయకట్టు వరకు పూర్తిస్థాయిలో సాగునీందించేందుకు అధికారులు ప్రణాళికలు చేపడుతున్నారు. జూరాల లింక్ కెనాల్ ద్వారా రోజుకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించి సాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని ఆర్డీఎస్ ఈఈ విజయ కుమార్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసులు పేర్కొన్నారు.

రైతుల ఆనందం

సరిపడా వర్షాలు లేనందున పంటలు వాడుబడుతున్నాయని, వెంటనే నీటిని విడుదల చేయాలని ఆర్డీఎస్ అధికారులను రైతులు కోరడంతో మూడు రోజుల క్రితం తుమ్మిళ్ల లిఫ్ట్‌ను ఆన్ చేశారు. ప్రస్తుతం ప్రధాన కాల్వలో నీరు నిండుగా ప్రవహిస్తూ డిస్ట్రిబ్యూటరీలు, సబ్ డిస్ట్రిబ్యూటరీల్లోని పిల్ల కాల్వలకు సైతం నీరు అందుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టు కింద సాగుచేసిన మిరప, మొక్కజొన్న, సీడుజొన్న, కూరగాయలు, పత్తి పంటలకు పుష్కలంగా సాగునీరందుతోందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కృష్ణ

అమరచింత: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల అభ్యున్నతికి కావాల్సిన విద్య, వైద్యం, ఉపాధి కల్పనను విస్మరించి ఉచిత పథకాలతో బానిసలుగా తయారు చేస్తున్నాయని మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కృష్ణ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా శిక్షణ తరగతులకు ఆయనతో పాటు సీహెచ్ రాంచందర్, కె.సూర్యం ముఖ్యవక్తలుగా హాజరయ్యారు. మొదట లెనిన్ మరణించి వందేళ్లయిన సందర్భంగా కార్యాలయంలో అమరులకు విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. కార్మికవర్గ చైతన్య పోరాటాలకు కమ్యూనిస్టుల ఆచరణ కార్యాచరణ కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎల్‌ఐసీని ప్రైవేట్‌పరం చేస్తూ రైతుల రాయితీ పథకాలను దూరం చేస్తోందని ఆరోపించారు. ఒంటరిగా సమస్యల కోసం పోరాటం చేస్తే వాటిని దక్కించుకునే అవకాశాలు తక్కువగా ఉంటాయని.. ప్రజా ఉద్యమాలతోనే శ్రామికులు, కర్షకులు దోపిడీ వ్యవస్థను పారద్రోలుతారన్నారు. నాడు దోపిడీ, పెట్టుబడి విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలు నిర్వహించి ప్రపంచంలో పెనుమార్పులు తీసుకొచ్చిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు హన్మంతు, అరుణ్‌కుమార్, ప్రసాద్, రాజన్న, రాజు, సాంబశివుడు, గణేష్, సామేలు, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

ఒక నెలతో సరి.. ఒకటో తేదీ జీతాల్లేవ్

- ఏపీలో 2 లక్షలమంది ఉపాధ్యాయుల్లో ఆందోళన
- పెన్షనర్లకూ తప్పని ఆర్థికకష్టాలు

సాక్షి, అమరావతి: తమది ఉద్యోగుల ప్రభుత్వమని, అందరికీ ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన విధంగా కూటమి ప్రభుత్వం వేతనాలివ్వడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అధికారంలోకి వచ్చాక జూలై నెలలో మాత్రమే ఒకటో తేదీన జీతాలిచ్చారని, తర్వాత నెలల్లో ఐదు, ఆరు తేదీల్లోనే వేస్తున్నారని తెలిపారు. ప్రతినెలా మంగళవారం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో దాదాపు రెండులక్షల మంది ఉపాధ్యాయులకు అక్టోబర్ నెల వేతనాలను నవంబర్ ఒకటో తేదీన ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటివరకు జమ చేయలేదు. పెన్షన్లు కూడా అందరికీ అందలేదు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, మొదటి నెలలో మాత్రం ఒకటో తారీకు జీతాలు చెల్లించి, తర్వాత ప్రతినెలా 4, 5, 6, తారీకుల్లో జీతాలు ఇస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పిల్లల ఫీజులు, ఇంటి ఖర్చులు, ఈఎంఐ వంటి అవసరాలతో ఇబ్బందిపడుతున్నామని పేర్కొంటున్నారు. ఒకటో తేదీన వేతనాలు ఇవ్వకపోవడంతో ఈఎంఐలు సకాలంలో చెల్లించలేక డిఫాల్టర్లుగా మారుతున్నామని ఆవేదన చెందుతున్నారు. పెన్షన్ సొమ్ముతో జీవనం సాగిస్తున్నవారి పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. ఉపాధ్యాయులకు ఇప్పటివరకు పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ లోన్లు, మెడికల్ బిల్లులు, సరెండర్ లీవులు జమచేయలేదని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, గెడ్డం సుధీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము దాచుకున్న డబ్బును ఇవ్వకపోతే తమ పిల్లల చదువులు ఏం కావాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. డబ్బులు అప్పు తెచ్చి ఎంతకాలం వడ్డీలు చెల్లించాలని ప్రశ్నించారు.

హంసలదీవిలో డాల్ఫిన్ల సందడి



కృష్ణానది సముద్రంలో కలిసేచోట కనువిందు

- వీటిని ఫొటోల్లో బంధించేందుకు ప్రకృతి ప్రేమికుల ఆసక్తి
- మన సముద్ర తీరాల్లో తరచుగా కనిపిస్తున్న హంప్ బ్యాక్ డాల్ఫిన్లు
- ఇవే తీరానికి దగ్గరగా వచ్చే డాల్ఫిన్ జాతులు
- విశాఖ, సూర్యలంక, కాకినాడ తీరాల్లోనూ ఇవి సాధారణమంటున్న నిపుణులు
- బాటిల్‌నోస్, పార్‌పోయిస్ జాతి డాల్ఫిన్లు కూడా మన తీరంలో సర్వసాధారణం

సాక్షి, అమరావతి : సాగర సంగమ తీరంలో డాల్ఫిన్లు కనువిందు చేస్తున్నాయి. కృష్ణాజిల్లా హంసలదీవిలో ఇవి తరచూ కనిపిస్తున్నాయి. ఇది కృష్ణా నది సముద్రంలో కలిసేచోటు కావడంతో అవి ఎక్కువగా ఈ ప్రాంతంలో కనిపిస్తాయని స్థానికులు చెబుతున్నారు. ఇవి గుంపులు గుంపులుగా తిరుగుతూ అప్పుడప్పుడు సముద్ర తీరానికి దగ్గరగా వస్తున్నాయని.. ఒక్కో గుంపులో 15 నుంచి 30 వరకూ ఉంటూ కనిపిస్తాయని వారంటున్నారు. విశాఖపట్నం, బాపట్లలోని సూర్యలంక, కాకినాడ బీచ్‌ల్లోనూ ఈ డాల్ఫిన్లు ఎక్కువగా కనిపిస్తాయి. తాజాగా.. ఆదివారం విజయవాడ నేచర్ క్లబ్‌కు చెందిన డాక్టర్ కిషోర్ హంసలదీవి వద్ద సముద్రంలో రెండు డాల్ఫిన్లను తన కెమెరాలో బంధించారు.

తూర్పు తీరంలో ఇవి సర్వ సాధారణం..

హిందూ మహా సముద్రంలో కనిపించే వీటిని హంప్ బ్యాక్ డాల్ఫిన్లుగా పిలుస్తారు. మన దేశ తూర్పు, పశ్చిమ తీరాల్లో ఇవి కనిపించడం చాలా సాధారణం. అయితే, తూర్పు, పశ్చిమ తీరాల్లో కనిపించే డాల్ఫిన్ల మధ్య జన్యుపరంగా స్వల్ప తేడాలుంటాయి. హంప్ బ్యాక్ డాల్ఫిన్లు ముదురు బూడిద రంగులో ఉంటాయి. వాటి ఉపరితల భాగం చాలా చిన్నదిగా కనిపిస్తుంది. వాటికి ఎత్తయిన మూపురం ఉంటుంది. సముద్రంలో డాల్ఫిన్ల మూపురం బయటకు కనిపిస్తుంది. వాటి ఆధారంగానే డాల్ఫిన్లను గుర్తిస్తారు. ఒక పెద్ద హంప్ బ్యాక్ డాల్ఫిన్ పొడవు సుమారు 3.5 మీటర్లు ఉంటుంది. కొత్తగా పుట్టిన డాల్ఫిన్లు కూడా ఒక మీటర్ పొడవు ఉంటాయి. వాటిలో ఆడ, మగ గురించి మాత్రం సరైన అధ్యయనాల్లేవు.

తీరానికి దగ్గరగా వచ్చే డాల్ఫిన్లు ఇవే..

ఇక డాల్ఫిన్లు మన సముద్ర తీరంలో కనిపించడం సర్వ సాధారణం. అయితే, వాటిల్లో తీరానికి దగ్గరగా కనిపించేవి హంప్‌బ్యాక్ డాల్ఫిన్లు మాత్రమే. మిగిలిన డాల్ఫిన్ జాతులు సముద్రంలోనే ఇంకా లోతులో ఉంటాయి. డాల్ఫిన్ల గురించి అధ్యయనం చేసేవాళ్లు, చూసేవాళ్లు లేకపోవడంవల్ల వాటి గురించి పెద్దగా బయటకు తెలీడంలేదు. చూసేవాళ్లకు మాత్రం అవి రెగ్యులర్‌గా కనిపిస్తూనే ఉంటాయి. సూర్యుడు ఉదయించే సమయాల్లో అవి తీరానికి దగ్గరగా వస్తాయి. బాటిల్‌నోస్, పార్‌పోయిస్ జాతులు కూడా తూర్పు తీరంలో తరచూ కనిపిస్తాయి. బాటిల్‌నోస్ జాతి కొంచెం లోతున్న ప్రాంతాల్లో కనిపిస్తాయి. పార్‌పోయిస్ జాతి డాల్ఫిన్లు కూడా తీరానికి దగ్గరగా వస్తాయి. కానీ, మిగిలిన వాటిల్లా వాటికి వెన్నురెక్క ఉండదు. అందుకే అవి బయటకు కనపడవు. శీతాకాలంలో స్పిన్నర్ డాల్ఫిన్లు (పైకి ఎగిరి నీటిలో పడేవి) విశాఖలో తీరంలో కనిపిస్తాయి. డాల్ఫిన్లు, తిమింగలాలు చనిపోయి లేదా దెబ్బతగిలి ఒడ్డుకు కొట్టుకువస్తే వాటి వివరాలు సేకరించి అటవీ శాఖకు సమాచారం ఇస్తున్నాం.

– ప్రణవ్, ఈస్ట్ కోస్ట్ కన్జర్వేషన్ టీమ్

సమూహాలుగా తిరుగుతాయి..

నిజానికి.. ఇవి సముద్రంలో సమూహాలుగా తిరుగుతాయి. 50 నుంచి 100 డాల్ఫిన్లు ఒకేచోట ఉంటాయి. వాటిలోనే కొన్ని చిన్న గుంపులుగా విడిపోయి సంచరిస్తాయి. మన తూర్పు తీరంలోని నదీ ముఖ ద్వారాలు, నదీ ముఖాల చుట్టూ ఉన్న తీరాలకు 1.5 కిలోమీటర్ల దూరం, 10–20 మీటర్ల లోతులో ఇవి సంచరిస్తాయి. సముద్రంలో ఉండే పలు రకాల చేపలను తిని ఇవి జీవిస్తాయి. ఇక దెబ్బలు తగిలినప్పుడు, చనిపోయినప్పుడు ఇవి తీరానికి కొట్టుకొస్తాయి. అప్పుడప్పుడు ఇవి మత్స్యకారుల వలలకు చిక్కుతాయి. హంప్‌బ్యాక్ డాల్ఫిన్లు మన దేశంలో పశ్చిమ తీరం వెంబడి గుజరాత్ నుండి కేరళ, తమిళనాడు నుంచి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఎక్కువగా కనిపిస్తాయి.

తక్షణమే సెలవుపై వెళ్లండి!

▶ మొదటి పేజీ తరువాయి

గత నెలలో నిర్వహించిన ఓ సమీక్షలో మంత్రులు ఆదేశించడంతో ప్రాజెక్టు అధికారులు తొందరపడి టెండర్లను ఆహ్వానించినట్టు తెలుస్తోంది. అయితే తక్షణమే టెండర్లు నిర్వహించాలని మంత్రులు ఆదేశించిట్టు మీటింగ్ మినట్స్‌లో సైతం ఉందని, అందుకే ఆహ్వానించట్టు బాధ్యులైన అధికారులు పేర్కొంటున్నారని సమాచారం. కాగా పాలనాపరమైన అనుమతులే కాకుండా ఆర్థిక శాఖ ఆమోదం కూడా లేకుండా టెండర్లను ఆహ్వానించడం నిబంధనల తీవ్ర ఉల్లంఘనే అని నీటిపారుదల శాఖలో చర్చ జరుగుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నాగార్జునసాగర్ కాల్వకు గండ్లుపడగా, పాలనాపరమైన అనుమతుల జారీ తర్వాతే అత్యవసర మరమ్మతులు చేపట్టారని, అనుమతుల విషయంలో మినహాయింపు ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

అనుమతుల్లేకుండా బిడ్లను ఎలా తెరుస్తారు ?

డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు సంబంధించిన ఆరు టెండర్లకు ఈ నెల 8తో, ఒక టెండర్‌కు ఈ నెల 4తో బిడ్ల దాఖలు గడువు ముగియనుంది. కమిషనరేట్ ఆఫ్ టెండర్స్ (సీఓటీ)లోని చీఫ్ ఇంజనీర్ల కమిటీ బిడ్లను పరిశీలించి ఎల్–1 బిడ్డర్‌ను ఖరారు చేయాల్సి ఉంటుంది. అయితే సంబంధిత పనులకు పాలనాపరమైన అనుమతులు, ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా బిడ్లను తెరిచి పరిశీలించడానికి నిబంధనలు ఒప్పుకోవని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో ఇలాంటి సంఘటనలు జరిగి ఉంటే ఎలాంటి చర్యలు తీసుకున్నారో పరిశీలించి ముందుకు వెళ్లాల్సి ఉంటుందని ఓ అధికారి 'సాక్షి'కి తెలిపారు.

టెండర్లపై రాజకీయ రగడ

- ఇప్పుడు మీపై ఏ కమిషన్ వేయాలి?: కేటీఆర్

పాలనాపరమైన అనుమతుల్లేండానే సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీలు, ఇతర పనులకు అధికారులు టెండర్లను ఆహ్వానించినట్టు వెలుగులోకి రావడంతో రాజకీయ రగడ ప్రారంభమైంది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5 మధ్య ఏడు పనులకు రూ. 1,842 కోట్ల అంచనాతో నీటిపారుదల శాఖ టెండర్లను ఆహ్వానించగా, అందులో రూ. 1,074 కోట్ల పనులకు పాలనాపరమైన అనుమతుల్లేవంటూ ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. వార్తా కథనాన్ని షేర్ చేస్తూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం, పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుల మీద పగబట్టి హాహాకారాలు చేస్తూ బురదజల్లిన వారు..అనుమతి లేకుండానే రూ.1,074 కోట్ల పనులకు టెండర్లు ఎలా పిలుస్తారంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రజాపాలన అని రోజుకు పదిమార్లు ప్రగల్భాలు పలికేటోళ్లు ఇలా ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఒక సమావేశంలో త్వరగా టెండర్లు పిలవాలని ఆదేశించి, మరో సమావేశంలో ఇదేంటి అంటూ నంగనాచి మాటలు మాట్లాడడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు పూర్తయ్యి కోటి ఎకరాలకు జీవం పోస్తున్న కాళేశ్వరంపై కమిషన్ వేసి విచారణ జరిపిస్తున్న మీపై.. ఇప్పుడు ఏ కమిషన్ వేయాలని ప్రశ్నించారు.

ఢిల్లీ నేస్తం..అవినీతి హస్తం

కాళేశ్వరంపై కక్షగట్టి రైతుల పొట్టగొట్టారని, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల మీద పగబట్టి మళ్లీ వలసలకు పచ్చజెండా ఊపారని కేటీఆర్ మండిపడ్డారు. ఢిల్లీ నేస్తం–అవినీతి హస్తం అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.7,926.14 కోట్ల అంచనాతో 2016 ఫిబ్రవరి 18న పాలనాపరమైన అనుమతులివ్వగా, ఆ తర్వాత 2018 ఆగస్టులో అప్పటి ప్రభుత్వం రూ.13,057 కోట్లకు అంచనాలను సవరించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దీనిని తప్పుబడుతూ రాష్ట్ర మంత్రులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదే విషయాన్ని ఇప్పుడు గుర్తుచేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

ఇది రాజ్యాంగంపై నేరుగా దాడే

- సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులపై వైఎస్ జగన్ మండిపాటు
- వారిని నిర్బంధించడం ప్రాథమిక హక్కులను కాలరాయడమే
- పోలీసుల అధికార దుర్వినియోగం క్షమార్హం కాదు
- వీటిని ఆపకపోతే హక్కుల పరిరక్షణకు చట్టపరంగా చర్యలు



సాక్షి, అమరావతి: టీడీపీ నేతల ప్రోద్బలంతో రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా కార్యకర్తలను పోలీసులు అక్రమంగా నిర్బంధించడాన్ని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ''ఎక్స్'' ఖాతాలో తీవ్రంగా ఖండించారు. దీన్ని తక్షణం ఆపకుంటే చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ''సోషల్ మీడియా కార్యకర్తలను నిర్బంధించడం అంటే వారి ప్రాథమిక హక్కులను కాలరాయడమే.. రాజ్యాంగంపై ప్రత్యక్షంగా దాడి చేయడమే. టీడీపీ నాయకుల ప్రభావంతో, రాజకీయ ప్రేరేపిత చర్యల్లో భాగంగా సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేసి, కస్టడీలో వారి పట్ల అమానవీయంగా ప్రవర్తించడం అన్ని ప్రజాస్వామ్య సూత్రాలను తీవ్రంగా ఉల్లంఘించడమే. పోలీసుల అధికార దుర్వినియోగం క్షమించరానిది. భావవ్యక్తీకరణ హక్కులకు విరుద్ధమైనది. ఈ రాజకీయ ప్రేరేపిత చర్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. వీటిని తక్షణమే ఆపకుంటే సోషల్ మీడియా కార్యకర్తల హక్కులను పరిరక్షించడానికి, చట్టపరమైన చర్యలను తీసుకోవడానికి ఏమాత్రం వెనుకాడబోం'' అని హెచ్చరించారు.

ఢిల్లీలో కొనసాగుతున్న గ్యాంగ్‌ల బెదిరింపుల పర్వం

వ్యాపారి ఇంటిపైకి కాల్పులు జరిపిన షోకీన్ గ్యాంగ్

న్యూఢిల్లీ: తిహార్ జైలులో గడుపుతున్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌కు పోటీగా మరికొన్ని గ్యాంగ్‌లు ఢిల్లీలో బెదిరింపులకు పాల్పడుతున్నాయి. బెదిరింపులకు సంబంధించిన వీడియో ఒకటి తాజాగా బహిర్గతమవడంతో గ్యాంగ్‌ల మధ్య పోటీ విషయం మరోసారి చర్చనీయాంశమైంది. రూ.15 కోట్ల నగదు బెదిరింపుల అంశం వెలుగులోకి వచ్చినవేళ ఈ అంశం బయటకురావడం గమనార్హం. కౌశల్ చౌదరి అనే గ్యాంగ్‌స్టర్ ప్రస్తుతం గురుగ్రామ్ జైలులో ఉన్నాడు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఇతని గ్యాంగ్‌కు శత్రుత్వం ఉంది. తన గ్యాంగ్‌ను విస్తరించేందుకు చౌదరి తోటి పవన్ షోకీన్ గ్యాంగ్‌తో చేతులు కలిపాడు. వ్యాపారులను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నాడు. గత నెల 26న ఢిల్లీలోని రాణీబాగ్‌లో ఒక వ్యాపారి ఇంటి మీదకు ఒక షూటర్ కాల్పులు జరిపిన వీడియో తాజాగా బయటికొచ్చింది. అమెరికాలో ఉంటున్న షోకీన్ ఆదేశాల మేరకు 'బాంబిహా గ్యాంగ్'సభ్యులు ఇద్దరు అక్టోబర్ 26న ఒక వ్యాపారి ఇంటి వద్దకు వచ్చి అందులో ఒకడు 'బాంబిహా గ్యాంగ్'అని రాసి ఉన్న ఒక చిట్టీని ఇంటి ప్రాంగణంలోకి విసిరాడు. ఈ తతంగాన్ని అంతా తన మొబైల్‌లో వీడియోతీసి అమెరికాలో ఉంటున్న గ్యాంగ్‌స్టర్ పవన్‌కు పంపించాడు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు పోటీగా నిధులు సమీకరించేందుకే ఈ ఢిల్లీ వ్యాపారిని బెదిరిస్తున్నట్లు సమాచారం.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు/ రాజోళి/ దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో మరింత తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు 15,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఆదివారం సాయంత్రం వరకు 11,500 క్యూసెక్కులకు తగ్గింది. దీంతో విద్యుదుత్పత్తి నిమిత్తం 5,385 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 730, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు వదలగా.. మరో 72 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.521 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సుంకేసులలో 2 గేట్ల ఎత్తివేత..

సుంకేసులలో రెండు గేట్లు ఎత్తి నీటి విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఆదివారం ఎగువ నుంచి 8,750 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. 6,257 క్యూసెక్కులు దిగువకు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

శ్రీశైలంలో 880.3 అడుగులు

శ్రీశైలం జలాశయంలో ఆదివారం 880.3 అడుగుల వద్ద 189.8936 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 5,385 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 6,257 మొత్తం 11,642 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తుంది. దీంతో శ్రీశైలం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 15,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,510, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



త్వరలో పాలమూరుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



రాచాలలో మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న బాలానగర్ విద్యార్థినులు

అడ్డాకుల: ప్రభుత్వం పాలమూరు జిల్లాలో త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల మండలం రాచాలలో ఏర్పాటు చేసిన 68వ ఎస్‌జీఎఫ్ అండర్– 17 బాలికలు, అండర్–19 బాలుర రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఆదివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలోని ప్రతి ఉమ్మడి జిల్లాకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో పాలమూరు జిల్లాలోని దేవరకద్ర నియోజకవర్గంలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరినట్లు వివరించారు. ఇందుకు జాతీయ రహదారి సమీపంలో కావాల్సిన ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని తెలియజేశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ క్రీడాకారుడు కావడంతో క్రీడలకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి పెద్దపీట వేశారని గుర్తుచేశారు. క్రీడల్లో రాణిస్తే శారీరక, మానసికోల్లాసంతో పాటు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. రాష్ట్రస్థాయి పోటీలను రాచాలలో ఏర్పాటు చేయించడానికి శథవిధాల ప్రయత్నం చేశానని, ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలు తీవ్ర పోటీ పడ్డాయన్నారు. తాను పట్టుబట్టి పోటీలను మన జిల్లాకు తెచ్చినట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతం చేసేందుకు అందరూ కృషిచేయాలన్నారు. అంతకు ముందు బాలానగర్ విద్యార్థులు చేసిన మార్చ్ ఫాస్ట్ ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా అండర్– 19 బాలుర విభాగంలో మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లా జట్ల పోటీలు, అండర్– 17 బాలికల విభాగంలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లా జట్ల మధ్య మ్యాచులను ఎమ్మెల్యే ప్రారంభించి తిలకించారు. కాగా రాచాలలో పోటీలు ఏర్పాటు చేయాలని కోరిన మాజీ సర్పంచ్ తిరుపతయ్య, పీఈటీ రాజవర్ధన్‌రెడ్డిలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ కురుమూర్తి, మాజీ ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీహరి, నాగిరెడ్డి, విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, తిరుపతయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి గోగేమ్‌లో ప్రతిభచాటాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ స్కూల్ ఇండోర్ హాల్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ గోగేమ్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా గో గేమ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు నస్రుల్లా హైదర్, కార్యదర్శి గులాం అఫ్రోజ్, ఉపాధ్యక్షుడు ఎండీ షకీల్ మాట్లాడుతూ ఎన్నికైన జట్లకు మూడు రోజుల కోచింగ్ నిర్వహిస్తామన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో ఈ నెల 15 నుంచి 17 వరకు జాతీయస్థాయి సబ్ జూనియర్, జూనియర్ గోగేమ్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.



గోగేమ్ ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

పంజాబ్ తరలిన పీయూ తైక్వాండో జట్టు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పురుషుల తైక్వాండో జట్టు ఆదివారం పంజాబ్ రాష్ట్రం బయలుదేరింది. మంగళవారం నుంచి శనివారం వరకు అమృత్‌సర్‌లోని గురునానక్ యూనివర్సిటీలో తైక్వాండో పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను అకాడమిక్ జాయింట్ డైరెక్టర్ అంకం భాస్కర్ అభినందించి, వారికి ట్రాక్ సూట్లు అందజేశారు. అలాగే బుధవారం హాకీ జట్లు, గురువారం ఆర్చరీ, శుక్రవారం ఖోఖో జట్ల ఎంపికలు ఉంటాయని పీడీ శ్రీనివాస్ తెలిపారు.

హెచ్‌సీఏ టోర్నీల్లో చాంపియన్‌గా నిలవాలి



ఉమ్మడి జిల్లా అండర్- 23 క్రికెట్ జట్టుతో రాజశేఖర్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హెచ్‌సీఏ క్రికెట్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి చాంపియన్‌గా నిలవాలని మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (ఎండీసీఏ) ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. సోమవారం వరంగల్, సంగారెడ్డిలో ప్రారంభమయ్యే హెచ్‌సీఏ అండర్–23 వన్‌డే అంతర్ జిల్లా లీగ్ కం నాకౌట్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు ఆదివారం తరలివెళ్లింది. ఈ సందర్భంగా జిల్లాకేంద్రం పిల్లలమర్రి సమీపంలో క్రికెట్ మైదానంలో ఉమ్మడి జిల్లా జట్టును అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రికెట్ క్రీడాకారులకు హెచ్‌సీఏ టోర్నమెంట్ మంచి వేదికలా ఉపయోగపడుతుందన్నారు. ఈ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు మెరుగ్గా ఆడి విజేతగా నిలవాలని, క్రీడాకారులు తమ వ్యక్తిగత ప్రతిభను చాటాలని కోరారు. టోర్నీలో ప్రతిభ కనబరిచే వారు రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్‌కు ఎంపికవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, కృష్ణమూర్తి, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా పాల్గొన్నారు. టోర్నీలో జిల్లా జట్టు తన తొలి మ్యాచ్‌ను ఆదిలాబాద్ జట్టుతో ఆడనుంది.

అండర్– 23 ఉమ్మడి జిల్లా జట్టు..

ఎ.శ్రీకాంత్ (కెప్టెన్), డేవిడ్ క్రిపాల్, మహ్మద్ షాదాబ్, అబ్దుల్ రాఫే, ఎండీ ముఖిత్, ఎండీ అద్నాన్, ఈ.అభిలాష్‌గౌడ్, కొండ శ్రీకాంత్, ఎస్.అరవింద్, చత్రపతి, జస్వంత్, తరుణ్, ప్రణీత్, అక్షయ్, అంజి ఉన్నారు.

ఉత్సాహంగా టీ-10 క్రికెట్ టోర్నీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ.వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి రోడ్డులోని ఎండీసీఏ మైదానంలో 3వ జలజం సత్యనారాయణ టీ- 10 ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగుతోంది. ఐదోరోజు ఆదివారం ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ.వెంకటేశ్ క్రీడాజట్లను పరిచయం చేసుకొని మాట్లాడుతూ నిరంతరం ప్రాక్టీస్ ద్వారా క్రీడల్లో ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చన్నారు. జిల్లా క్రీడాకారులు క్రీడల్లో రాణించి తల్లిదండ్రులు, జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓడిన వారు నిరాశచెందకుండా మళ్లీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, పీఈటీలు వినోద్‌కుమార్, అరుణ్, మునీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్‌ల ఫలితాలు

ఐదోరోజు మ్యాచుల్లో జ్ఞానభారతి జట్టు 9 పరుగుల తేడాతో చైతన్య స్కూల్ జట్టుపై విజయం సాధించింది. ఇతర మ్యాచ్‌ల్లో రెయిన్ బో స్కూల్ జట్టు 87 పరుగుల తేడాతో యూనివర్సల్ స్కూల్ జట్టుపై, జెడ్పీహెచ్ఎస్ నంచర్ల జట్టు 5 వికెట్ల తేడాతో అపెక్స్ స్కూల్ జట్టుపై, సెయింట్ ఎంజెల్స్ జట్టు 5 వికెట్ల తేడాతో ఫాతిమా విద్యాలయం జట్టుపై గెలుపొందాయి.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న సమాచార హక్కు చట్టం రక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంప్రసాద్

కల్వకుర్తి టౌన్/కల్వకుర్తి రూరల్: అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమాచార హక్కు చట్టం రక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంప్రసాద్ కోరారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన 4వ రాష్ట్ర మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రజల్లో తీసుకెళ్లాలని ఆర్టీఐ కార్యకర్తలకు సూచించారు. అధికారుల్లో జవాబుదారీతనం పెంపొందించే విధంగా కృషి చేయాలన్నారు. ఎవరైనా అవినీతి, అక్రమాలకు యత్నిస్తే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. జోగిని నిర్మూలన పోరాట కమిటీ నాయకురాలు హాజమ్మ మాట్లాడుతూ.. జోగిని వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకృత్యాలను అడ్డుకోవడంతో పాటు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత్, న్యాయవాది కరుణాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బాబా, రాష్ట్ర మహిళా కన్వీనర్ సాత్వికరెడ్డి, కమలాకర్, నర్సింహులు, కరుణాకర్, విద్యాసాగర్, వెంకట్ రాథోడ్, కిరణ్‌కుమార్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉషూ క్రీడాకారుల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని బాయమ్మతోటలోగల అపెక్స్ సెంట్రల్ స్కూల్ ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి ఉషూ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషూ అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఎండీ షకీల్, కార్యదర్శి తాజుద్దీన్ మాట్లాడుతూ సబ్ జూనియర్ అండర్– 12, 14 విభాగాలకు బాల, బాలికలను ఎంపిక చేశామన్నారు. ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 9, 10 తేదీల్లో రంగారెడ్డి జిల్లా హస్తినాపురంలో జరిగే అంతర్ జిల్లా సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఖాజాఖాన్, కోశాధికారి ఎండీ ఇలియాజ్, తైమూర్ తదితరులు పాల్గొన్నారు.



ఉషూ క్రీడాకారులతో సంఘం ప్రతినిధులు